జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 39 ॥ బుధవారం ॥ 8-7-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-

08 జూలై 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:51 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి అష్టమి మ. 12:17 వరకు తరువాత నవమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం రేవతి సా. 4:00 వరకు తరువాత అశ్విని యోగం అతిగండ మ. 12:31 వరకు కరణం కౌలవ మ. 12:17 వరకు తైతుల రా. 11:30 వరకు వర్జ్యం లేదు దుర్ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు రాహుకాలం మ. 12:21 నుండి మ. 1:58 వరకు యమగండం ఉ. 7:28 నుండి ఉ. 9:06 వరకు గుళికాకాలం ఉ. 10:43 నుండి మ. 12:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:15 నుండి తె. 5:03 వరకు అమృత ఘడియలు మ. 1:37 నుండి మ. 3:11 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "o" అనగా మరుసటి రోజున



# వయనాడ్‌లో ఘోర విషాదం

## టన్నెల్ వద్ద కొండచరియలు విరిగిపడి ముగ్గురు కార్మికులు దుర్మరణం

### సహాయక చర్యలు ముమ్మరం

**వయనాడ్, జులై 7**

కేరళలోని వయనాడ్ జిల్లాలో మంగళవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మెప్పాడి సమీపంలోని కల్లాడి ప్రాంతంలో టన్నెల్ నిర్మాణ పనులు జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడటంతో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మట్టిదిబ్బలు, భారీ రాళ్ల కింద మరికొందరు చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. మీనాక్షి వంతెన సమీపంలో టన్నెల్ నిర్మాణం కోసం తవ్వకాలు చేపడుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా భారీగా కొండచరియలు విరిగిపడటంతో నిర్మాణ ప్రాంతమంతా (మిగతా 2వ పేజీలో)




# కాళేశ్వరంపై... ప్రత్యేక అసెంబ్లీ

## ప్రతిపక్షం కోరిన తేదీకే సమావేశాలు నిర్వహిస్తాం

## నిపుణుల సూచనలతోనే పునరుద్ధరణ పనులు

## ప్రాజెక్టును కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమన్న ముఖ్యమంత్రి



**హైదరాబాద్, జులై 7:** కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర చర్చ కోసం శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర చర్చ కోసం శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రతిపక్ష నాయకుడు సూచించిన(మిగతా 2వ పేజీలో)



# కవిత పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు సూచన


## ముందుగా ఈసీకి సమాధానం ఇవ్వండి

## ఇప్పుడే జోక్యం కుదరదు

## టీఆర్ఎస్ పేరుపై వివాదం

**న్యూఢిల్లీ, జులై 7**

కొత్త రాజకీయ పార్టీ పేరుకు సంబంధించి నెలకొన్న వివాదంపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు అనుమతి ఇవ్వాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ ఆమె పిటిషన్ (మిగతా 2వ పేజీలో)



4

# జిమ్‌లో గాయపడిన హిమాన్షు

## వ్యాయామం చేస్తుండగా ముక్కుకు స్వల్ప గాయం

## చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలింపు

## ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి



# మోదీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

## బింటాంగ్ ఆదిపూర్ణ స్వీకరణ

## భారత ప్రజలకే అంకితం

## ద్వైపాక్షిక బంధాలకు గుర్తింపు

**జకార్తా, జులై 7**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపూర్ణ' ప్రదానం చేశారు. ఈ గౌరవాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నానని మోదీ తెలిపారు. ఈ పురస్కారం తనకు మాత్రమే (మిగతా 2వ పేజీలో)



# ఆయిల్‌పామ్ రైతులకు అండగా ఉంటాం

## భూపాలపల్లిలో రైతులతో సమావేశమైన కేటీఆర్

## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ప్రత్యేక ప్రోత్సాహాలు

## మలేషియాలో అధ్యయన పర్యటనలు నిర్వహిస్తామని హామీ

**బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయిల్‌పామ్ రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హామీ ఇచ్చారు.**

**భూపాలపల్లి, జులై 7**

బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయిల్‌పామ్ రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు అందిస్తామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హామీ ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులతో సమావేశమైన ఆయన వారి అనుభవాలు, సమస్యలు, సూచనలను తెలుసుకున్నారు. వ్యవసాయ రంగంలో పంటల వైవిధ్యీకరణకు (మిగతా 2వ పేజీలో)



# పౌష్టికాహారం, నాణ్యమైన విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

## నాచారంలో నూతన బాలామృతం తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి

## బాలల ఆరోగ్యమే తెలంగాణ భవిష్యత్తు.. బాలల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం

**రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆరోగ్యవంతమైన బాలలే తెలంగాణ భవిష్యత్తును నిర్మిస్తారని పేర్కొన్నారు.**

**హైదరాబాద్, జులై 7**

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఆరోగ్యవంతమైన బాలలే తెలంగాణ భవిష్యత్తును నిర్మిస్తారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాచారం పారిశ్రామిక ప్రాంతంలో తెలంగాణ ఆహార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన బాలామృతం తయారీ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉత్పత్తి, ప్యాకింగ్ విభాగాలను పరిశీలించి మొక్కనాటారు. గర్భిణులు, బాలింతలు, ఆరు సంవత్సరాల లోపు చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు. తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి చిన్నారి ఎదుగుదల వరకు సరైన పోషకాహారం అందితేనే (మిగతా 2వ పేజీలో)

# నేటి రాశి ఫలాలు

మేషం : మీ కృషికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. శ్రమకు తగ్గ పురోగతి సాధించే అవకాశం ఉంది. వ్యాపార రంగంలో కొత్త అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగంలో చురుకుదనం ప్రదర్శిస్తే ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. సూర్యధ్యానం విజయాన్నిస్తుంది.

వృషభం : కృషికి తగిన ఫలితం వస్తుంది. బంధుమిత్రుల సహకారం మీలో ఉత్సాహాన్ని పెంచుతుంది. పాత విభేదాలు తొలగి బంధాలు మెరుగుపడతాయి. విలువైన వస్తువుల కొనుగోలు ఆనందాన్ని కలిగిస్తుంది. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం నూతన ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

మిథునం : ఆత్మవిశ్వాసమే మీ విజయానికి ప్రధాన ఆధారం అవుతుంది. ఆటంకాలను సమర్థంగా అధిగమిస్తారు. సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. బంధుమిత్రులతో కలిసి చేపట్టిన పనులు సానుకూల ఫలితాలనిస్తాయి. ఇష్టదేవతా స్తోత్ర పారాయణం ఆత్మబలాన్ని పెంచుతుంది.

కర్కాటకం : సహచరుల సహకారంతో పనులు విజయవంతమవుతాయి. స్థిరమైన నిర్ణయాలు మంచి ఫలితాలను అందిస్తాయి. చిన్న చిన్న విభేదాలను పట్టించుకోకుండా ముందుకు సాగాలి. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. శివనామ స్మరణ మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

సింహం : ఆటంకాలు ఎదురైనా మనోధైర్యం కోల్పోవద్దు. సహనం, పట్టుదల మీకు విజయాన్ని అందిస్తాయి. ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెడితే మంచిది. ఆలోచించి తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. నవగ్రహ శ్లోక పఠనం ప్రతికూలతలను తగ్గిస్తుంది.

కన్య : కొన్ని సవాళ్లు ఎదురైనా పట్టుదలతో విజయాన్ని సాధిస్తారు. కుటుంబ సభ్యుల సలహాలు మార్గదర్శకంగా నిలుస్తాయి. శారీరక శ్రమ పెరిగినా ఫలితం సంతృప్తికరంగా ఉంటుంది. దుర్గా శ్లోక పఠనం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

తుల : మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. ధైర్యంగా ముందడుగు వేస్తే విజయాలు మీవే అవుతాయి. గోవింద నామస్మరణ మనోధైర్యాన్ని, ఉత్సాహాన్ని పెంచుతుంది.


వృశ్చికం : భవిష్యత్తుకు అనుకూలమైన పరిణామాలు కనిపిస్తున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో శుభఫలితాలు సాధిస్తారు. ఒక శుభవార్త మీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. సూర్యారాధన విజయమార్గాన్ని చూపుతుంది.

ధనుస్సు : మీ ప్రయత్నాలకు తగిన ఫలితాలు లభిస్తాయి. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మిత్రుల సహకారం మేలు చేస్తుంది. మానసిక దృఢత్వం మీకు నూతన అవకాశాలను అందిస్తుంది. శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. సూర్యశ్లోక పఠనం శుభప్రదం.

మకరం : మంచి ఫలితాలు మీకు అనుకూలంగా ఉన్నాయి. శుభ కార్యక్రమాల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకుంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆత్మీయులతో గడిపే సమయం సంతోషాన్నిస్తుంది. ఇష్టదైవ దర్శనం ఆత్మసంతృప్తిని కలిగిస్తుంది.

కుంభం : శారీరక శ్రమ అధికంగా ఉన్నప్పటికీ ఫలితం ఆనందాన్నిస్తుంది. బంధువులతో మితంగా, మృదువుగా వ్యవహరించడం మంచిది. ఖర్చులపై నియంత్రణ పాటిస్తే ఆర్థికంగా మేలు జరుగుతుంది. శని ధ్యానం స్థిరబుద్ధిని, సహనాన్ని ప్రసాదిస్తుంది.

మీనం : మీ ఓర్పు, సహనం విజయానికి పునాది అవుతాయి. కొన్ని పనులు ఆలస్యమైనా అనుకూల ఫలితాలు తప్పక లభిస్తాయి. భయాందోళనలను దూరంగా ఉండాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తే పరిస్థితులు అనుకూలిస్తాయి. నవగ్రహ ధ్యాన శ్లోక పఠనం ధైర్యాన్ని, మనోబలాన్ని పెంచుతుంది.



# ఆయిల్‌పామ్ రైతులకు అండగా ఉంటాం

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితాలపై రైతులతో చర్చించారు. తెలంగాణలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలన్న లక్ష్యాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్దేశించారని కేటీఆర్ తెలిపారు. మలేషియా, ఇండోనేషియా దేశాల తరహాలో ఆయిల్‌పామ్ సాగును అభివృద్ధి చేసి దేశంలో వంటనూనెల దిగుమతులను తగ్గించడంతో పాటు రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రోత్సహించామని చెప్పారు. వరి వంటి సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ ద్వారా మూడు రెట్లు ఎక్కువ ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో సుమారు లక్షన్నర ఎకరాల్లో ఉన్న ఆయిల్‌పామ్ సాగు ప్రస్తుతం దాదాపు మూడు లక్షల ఎకరాలకు విస్తరించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ సహకారం కొనసాగితే ఈ విస్తీర్ణం ఏడు లక్షల ఎకరాలకు చేరుకునే అవకాశముందని చెప్పారు. 2028లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, ఆ తర్వాత తెలంగాణను దేశంలోనే అత్యధిక ఆయిల్‌పామ్ సాగు చేసే రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు రైతులు తమ అనుభవాలను కేటీఆర్‌తో పంచుకున్నారు. సమాచార సాంకేతిక రంగంలో ఉద్యోగం చేస్తున్న అనిల్ అనే రైతు తాను ఏడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నానని, నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి ప్రారంభమై ప్రస్తుతం ఎకరాకు నాలుగు నుంచి ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తోందని తెలిపారు. ఉద్యోగంలో జీతం వచ్చినట్లే ఈ పంట ద్వారా ప్రతి నెల స్థిరమైన ఆదాయం లభిస్తోందని చెప్పారు. ఇతర రైతులు కూడా ఈ పంట తక్కువ నీటితో సాగవుతుందని, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం ఎక్కువగా ఉందని వివరించారు.

రైతులు కూలీల కొరత, యాంత్రీకరణ అవసరం, అదనపు డ్రిప్ వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వ సహాయం, విదేశాల నుంచి తక్కువ ధరలకు దిగుమతి అవుతున్న పామాయిల్ వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు.



## మోదీకి ఇండోనేషియా..

(మొదటి పేజీ తరువాయి)

కాకుండా భారత ప్రజలందరికీ దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, ఇండోనేషియా ప్రజల ఆప్యాయత, అభిమానానికి ఈ పురస్కారం ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. భారత్--ఇండోనేషియా దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న చారిత్రక, సాంస్కృతిక, స్నేహపూర్వక బంధాలకు ఇది గుర్తింపుగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ అత్యున్నత గౌరవాన్ని అందించిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రభోవో సుబియాంటోకు, ఆ దేశ ప్రభుత్వానికి, ప్రజలకు మోదీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. భారత్, ఇండోనేషియా మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర భద్రత, రక్షణ, సాంస్కృతిక రంగాల్లో సహకారం నిరంతరం విస్తరిస్తోం దని మోదీ పేర్కొన్నారు.

# వయనాడ్‌లో ఘోర విషాదం

(మొదటి పేజీ తరువాయి)

మట్టితో నిండిపోయింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు తప్పించుకునేలోపే మట్టిదిబ్బలు వారిపై పడటంతో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, జాతీయ విపత్తు స్పందన దళం సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు.

శిథిలాల కింద చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు భారీ యంత్రాలతో నిరంతరం మట్టిని తొలగిస్తున్నారు. రెస్క్యూ బృందాలు చేరుకునేలోపే స్థానికులు సైతం ధైర్యంగా సహాయక చర్యల్లో పాల్గొని పలువురిని రక్షించేందుకు ప్రయత్నించారు. ఇప్పటివరకు ఆరుగురిని సురక్షితంగా బయటకు తీసినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా కొందరు చిక్కుకుపోయి ఉండే అవకాశం ఉండటంతో గాలింపు కొనసాగుతోంది. ఈ ఘటనపై కేరళ ప్రభుత్వం వెంటనే స్పందించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. బాధితులను కాపాడేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సహాయక చర్యలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు సంబంధిత మంత్రులను సంఘటన స్థలానికి పంపించినట్లు ప్రభుత్వం తెలిపింది.

గత 24 గంటల్లో వయనాడ్ ప్రాంతంలో 265 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా నేల బలహీనపడి కొండచరియలు విరిగిపడినట్లు అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని టన్నెల్ నిర్మాణ పనులను సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. అయినప్పటికీ ప్రమాదం సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. కొండచరియలు విరిగిపడటంతో సమీపంలో ఉన్న పలు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతుండగా, మరిన్ని కొండచరియలు విరిగిపడే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రమాద ప్రాంతంలో ప్రజలు వెళ్లకుండా పోలీసులు ఆంక్షలు విధించారు. సహాయక చర్యలు పూర్తయ్యే వరకు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, బాధితులను రక్షించేందుకు అన్ని వనరులను వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## బాలల ఆరోగ్యమే తెలంగాణ భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు. పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా మెరుగైన పోషకాహారం పొందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందని చెప్పారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని అధికారులకు స్పష్టం చేశారు. గతంలో ప్రారంభమైన బాలామృతం కేంద్రం క్రమంగా విస్తరించి నేడు పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు కూడా పౌష్టికాహారం సరఫరా చేసే స్థాయికి ఈ సంస్థ అభివృద్ధి చెందిందన్నారు. బాలల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి పరిశ్రమలు మరిన్ని రావాలని, ప్రభుత్వం అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. విద్యారంగంలో కూడా ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి ఏడాది విద్యారంగానికి భారీగా నిధులు వెచ్చిస్తున్నామని, దానిని ఖర్చుగా కాకుండా రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుబడిగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పేదల పిల్లలకు కూడా ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను కూడా ముఖ్యమంత్రి వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు రుణాలు, సౌర విద్యుత్ కేంద్రాలు, మహిళా శక్తి కేంద్రాల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా భోజనశాలలు వంటి పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని తెలిపారు. 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వెల్లడించారు.

# కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీకి సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తేదీకే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. అవసరమైతే అసెంబ్లీ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని కూడా నిర్వహించి కాళేశ్వరం ప్రాజెక్టుపై కూలంకషంగా చర్చిద్దామని ప్రతిపాదించారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే నిపుణులు, మేధావులు పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన పరిష్కారం సూచించకుండా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రాజెక్టు పునరుద్ధరణపై శాస్త్రీయంగా నిర్ణయాలు తీసుకుంటామని, నిపుణుల సూచనల మేరకే ముందుకు సాగుతామని తెలిపారు. ప్రతిపక్ష నాయకుడు నిపుణుల్లో విశ్వాసం కలిగించే పరిష్కారం చూపగలిగితే వారి ఆధ్వర్యంలోనే మరమ్మతు పనులు చేపట్టేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణం, ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యమంత్రి వివరంగా ప్రస్తావించారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన నుంచి కాళేశ్వరంగా మారిన పరిణామాలను వివరించారు. మొదట రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిందని, డిస్ట్రిబ్యూటరీలు, ఆయకట్టు విస్తరణ వంటి అంశాల్లో లక్ష్యాలు నెరవేరకపోయినా వ్యయం మాత్రం భారీగా పెరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరం నిర్మాణం, రూపకల్పన, నిర్వహణలో ప్రమాణాలు పాటించి ఉంటే ప్రస్తుత పరిస్థితి వచ్చేది కాదన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో పునాది స్థిరత్వం, భూగర్భ పరిస్థితులపై తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ముఖ్యమంత్రి ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలపై ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు వచ్చినా వాటిని పట్టించుకోలేదన్నారు. కన్నెపల్లి పంపు కేంద్రంలో వరదల సమయంలో జరిగిన నష్టాన్ని కూడా గుర్తుచేశారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థతో పాటు పలు సాంకేతిక సంస్థల నివేదికలు కూడా నిర్మాణం, నాణ్యత, నిర్వహణలో లోపాలను స్పష్టంగా గుర్తించాయని తెలిపారు. ప్రాజెక్టు విషయంలో ప్రజల్లో అపోహలు సృష్టించకుండా వాస్తవాల ఆధారంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి కోరారు. సభలో నిపుణులు, న్యాయ నిపుణులను కూడా ఆహ్వానించి అన్ని అంశాలపై పారదర్శకంగా చర్చిద్దామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన అప్పులు, ప్రాజెక్టుపై చేసిన వ్యయంతో పాటు ప్రస్తుతం ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక బాధ్యతలను కూడా వివరించారు.

# కవిత పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు సూచన

(మొదటి పేజీ తరువాయి)

దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ప్రస్తుతం ఎన్నికల సంఘం ప్రక్రియలో జోక్యం చేసుకోవడం సరైంది కాదని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానం ఇవ్వాలని కవితకు హైకోర్టు సూచించింది. ఎన్నికల సంఘం తన విధుల పరిధిలో నిర్ణయాలు తీసుకుంటున్నందున, ఈ దశలో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం ఆ సంస్థ అధికారాల్లో జోక్యం చేసుకున్నట్లే అవుతుందని ధర్మాసనం పేర్కొంది. బీఆర్ఎస్ పాత పేరు 'తెలంగాణ రాష్ట్ర సమితి'కి సంక్షిప్త రూపంగా 'టీఆర్ఎస్' ఇప్పటికే ప్రజల్లో గుర్తింపు పొందిందని ఎన్నికల సంఘం అభిప్రాయపడింది. అదే సంక్షిప్త నామం కొత్త పార్టీకి కూడా రావడం వల్ల ఓటర్లలో గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంటూ జూన్ 23న కవితకు నోటీసులు జారీ చేసింది. 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలని ఆదేశించింది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఈ నోటీసులను కవిత హైకోర్టులో సవాలు చేశారు. తాను ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు అనుమతి ఇవ్వాలని, ఈసీ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోర్టును కోరారు. అయితే ఈ దశలో ఎన్నికల సంఘం నిర్ణయ ప్రక్రియను నిలిపివేయడానికి కోర్టు నిరాకరించింది. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన అనంతరం ఈ ఏడాది ప్రారంభంలో కవిత సొంత రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఏప్రిల్‌లో 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఎన్నికల సంఘం ప్రాథమిక ఆమోదం తెలిపింది.

# జిమ్‌లో గాయపడిన హిమాన్షు

హైదరాబాద్, జులై 7

భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు రావు జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఆయన ముక్కుకు స్వల్ప గాయం కావడంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. హిమాన్షుకు గాయమైన విషయం తెలియగానే కేటీఆర్ వెంటనే ఆసుపత్రికి చేరుకుని వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయనతో పా టు మాజీ మంత్రి టి. హరీశ్ రావు కూడా ఆసుపత్రికి వెళ్లి హిమాన్షును పరామర్శించారు.

శ్వేత

# సంపాదకీయం

బుధవారం 8-7-2026

## జనాభా పెరిగితే తట్టుకోగలమా?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండి పెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేధో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను

ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ది కాదని గుర్తిస్తే మంచిది.



## అసెంబ్లీకి రండి.. తేల్చుకుందాం!

### నిధులు కొల్లగొట్టేందుకే కాళేశ్వరం రీడిజైన్

### కేసీఆర్ కమీషన్ల కక్కుర్తితో ప్రాజెక్టుకే ఎసరు

### కేటీఆర్, హరీశ్ ఆర్థిక ఉగ్రవాదులు

### అంచనాలు పెంచి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారు

### జ్యుడీషియల్ ఎంక్వైరీ పూర్తయ్యాక చట్టప్రకారం చర్యలు

### కాళేశ్వరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 07: కాళేశ్వరం అనేది కేవలం కమీషన్ల ప్రాజెక్ట్ అని, నిధులు కొల్లగొట్టేందుకే మాజీ సీఎం కేసీఆర్ పక్కా ప్లాన్ వేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రాజెక్టు విధ్వంసానికి కారణమైన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులను తెలంగాణకు పట్టిన ఆర్థిక ఉగ్రవాదులుగా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో ఎనిమిది లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేశారని మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్ ప్రజా భవన్ లో కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహించిన అధికారిక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మాజీ సీఎం కేసీఆర్ పై నిప్పులు చెరిగారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కన్నెపల్లి మోటారు పంపులు మునిగిపోయిన దృశ్యాలను ఈ సందర్భంగా స్క్రీన్ పై ప్రదర్శించారు.

**కమీషన్ల కోసం అంచనాల పెంపు**

ప్రాజెక్టు రీడిజైన్ పేరుతో కేసీఆర్ పెద్ద కుట్ర చేశారని సీఎం విమర్శించారు. వైఎస్సార్ హయాంలో 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 39 వేల కోట్ల అంచనాతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించారు. తెలంగాణ ఏర్పడే నాటికి ఆ ప్రాజెక్టుపై 6 వేల కోట్లకు పైగా ఖర్చు చేశారు. కానీ, కేసీఆర్ కమిషన్ల కక్కుర్తితో ప్రాజెక్టు ఊరు, పేరు మార్చేశారు. 2015లో వేసిన విశ్రాంత ఇంజినీర్ల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజీ వద్దని నివేదిక ఇచ్చినా పక్కనపెట్టారు. దానికి బదులు వేమనపల్లి వద్ద బ్యారేజీ నిర్మిస్తే కొంతమేర పర్వాలేదని సూచించారు. కానీ తనకు కావాల్సిన రిపోర్ట్‌ను వ్యాప్కోస్ సంస్థతో ఇప్పించుకున్నారు. నీళ్లు, ఆయకట్టు పెరగకపోయినా అంచనా మాత్రం రూ.38 వేల కోట్ల నుంచి రూ.81 వేల కోట్లకు పెంచేశారు. చివరకు ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.1.47 లక్షల కోట్లకు పెరిగిందని కాగ్ నివేదిక కూడా స్పష్టం చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు.

**ఇసుక మీద కట్టిన మేడలు**

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల కింద ఆయకట్టే లేదని, కనీస భూ పరీక్షలు చేయకుండా కేవలం ఇసుక మీదనే బ్యారేజీలు కట్టారని సీఎం రేవంత్ మండిపడ్డారు. ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ, ఆపరేషనల్ మెయింటెనెన్స్ సరిగా లేకపోవడం వల్లే ఈ దుస్థితి దాపురించిందన్నారు. 2019 జూన్ లో ప్రాజెక్టు ప్రారంభిస్తే ఏడాదికే మేడిగడ్డ దెబ్బతిందని, మేడిగడ్డ వద్ద సీసీ బ్లాకులను సరిచేయాలని ప్రాజెక్టు ఈఈ రమణారెడ్డి 2020లోనే లేఖ రాసినా కేసీఆర్ సర్కార్ పట్టించుకోలేదని సీఎం ఆరోపించారు. నాణ్యత లేకపోవడం వల్లే 2022 గోదావరి వరదలకు కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోయిందని, ఆ వెంటనే 2023 అక్టోబర్లో మేడిగడ్డ బ్యారేజీ ఆరు పిల్లర్లు కుప్పకూలాయని రేవంత్ అన్నారు. బ్యారేజీలను విడతల వారీగా నీటిని నింపుతూ పరీక్షిస్తారు, కానీ కేసీఆర్ మాత్రం కట్టిన ఏడాదే పూర్తిగా నింపేశారు. బీఆర్ఎస్ హయాంలోనే ఎన్డీఎస్ఏ ఇచ్చిన ప్రాథమిక నివేదిక కూడా ఈ లోపాలను ఎత్తిచూపింది అని సీఎం స్పష్టం చేశారు.

**అసెంబ్లీకి రండి.. తేల్చుకుందాం**

కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ అనేది వెన్నెముక లాంటిదని, అది పనిచేయకపోతే ప్రాజెక్టు మొత్తం వృథానే అని రేవంత్ అన్నారు. వర్షాలు లేకపోయినా మోటార్లు వేసి నీళ్లు ఎత్తిపోస్తాం అంటూ హరీష్ రావు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ కోరుకున్న రోజున అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై జాయింట్ సెషన్ ఏర్పాటు చేసి చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు. స్పీకర్‌కు లేఖ రాయండి.. తేదీ ఖరారు చేయండి. మీ గౌరవానికి భంగం కలగకుండా సభను సజావుగా సాగేలా చూసుకునే బాధ్యత మాది అని సీఎం స్పష్టం చేశారు. తొమ్మిదిన్నరేళ్లలో ఎనిమిది లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని నాశనం చేశారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన తప్పులకు ప్రజలు ఉరి తీయాలని కోరుకుంటున్నా, చట్ట నిబంధనలు అడ్డొస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరుగుతోంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ విచారణ నివేదిక రాగానే బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టును ఎక్స్‌పర్ట్స్ సాయంతో ఎలాగైనా కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం అని ముఖ్యమంత్రి వివరించారు.


మీ కుటుంబ భవిష్యత్తు విదేశాల్లో ఉండొచ్చు...

## సరైన నిర్ణయం నేడు తీసుకోండి!

ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు... అధిక ఆదాయం... మెరుగైన జీవన ప్రమాణాలు... కుటుంబానికి భద్రమైన భవిష్యత్తు... ఇవి కేవలం కలలు మాత్రమే కావు. సరైన అర్హత, సరైన ప్రణాళిక, నిపుణుల మార్గదర్శకత్వం ఉంటే వాటిని లక్ష్యాలుగా మార్చుకోవచ్చు.

నేటి ప్రపంచంలో కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వంటి దేశాలు నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు వివిధ ఇమ్మిగ్రేషన్ అవకాశాలను అందిస్తున్నాయి. అయితే్రా= లేదా ఇతర ఇమ్మిగ్రేషన్ ప్రోగ్రామ్‌లు అందరికీ కాదు---అర్హత ఉన్నవారికే.

PR **వీసా... ప్రచారాలతో కాదు, మీ అర్హతతోనే!**

సోషల్ మీడియాలో కనిపించే ప్రతి ప్రకటన నిజం కాదు. ఇమ్మిగ్రేషన్ విజయాన్ని నిర్ణయించేది ప్రకటనలు కాదు, మీ ప్రొఫైల్ అర్హత.

**మీ అర్హతను నిర్ణయించే ముఖ్యమైన అంశాలు:**

వయస్సు
విద్యార్హతలు
వృత్తిపరమైన పని అనుభవం
ELTS / PTE వంటి భాషా నైపుణ్యం
వఓత్తి (Occupation)
ప్రస్తుత ఇమ్మిగ్రేషన్ విధానాలు

ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించిన తర్వాతే మీకు సరైన దేశం, సరైన ఇమ్మిగ్రేషన్ మార్గం ఎంపిక చేయబడుతుంది.

ఎందుకు Profile Evaluation అవసరం?

చాలామంది సరైన అవగాహన లేకుండా దరఖాస్తు చేసి సమయం, డబ్బు రెండింటినీ కోల్పోతున్నారు.

ముందుగా Profile Evaluation చేయించుకుంటే:

మీ అర్హత స్పష్టంగా తెలుస్తుంది.
మీకు సరిపోయే దేశం, ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకోవచ్చు.
అవసరమైన డాక్యుమెంట్లపై పూర్తి అవగాహన పొందవచ్చు.
అనవసర ఖర్చులు, సమయ నష్టాన్ని నివారించవచ్చు.

Canada PR **-- ప్రపంచ స్థాయి అవకాశాలకు ద్వారం**

**అర్హత కలిగిన అభ్యర్థులకు:**

Permanent Residency (PR) అవకాశం
ప్రపంచ స్థాయి ఉద్యోగ అవకాశాలు
మెరుగైన జీవన ప్రమాణాలు
కుటుంబంతో కలిసి స్థిరపడే అవకాశం
భవిష్యత్తులో పౌరసత్వానికి మార్గం

**Germany Opportunity Card** యూరప్‌లో కెరీర్‌కు కొత్త అవకాశం

అర్హత కలిగిన అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగ అవకాశాలను అన్వేషించి అంతర్జాతీయ కెరీర్‌ను నిర్మించుకునే అవకాశాన్ని పొందవచ్చు.

**Exxeella Immigration Services** –మీ విజయానికి విశ్వసనీయ భాగస్వామి ప్రతి అభ్యర్థి ప్రొఫైల్‌ను వ్యక్తిగతంగా విశ్లేషించి, వారి అర్హతకు అనుగుణంగా సరైన ఇమ్మిగ్రేషన్ మార్గాన్ని సూచించడం మా లక్ష్యం.


**మా సేవలు**

- Canada PR Profile Evaluation
- Australia PR Guidance
- Germany Opportunity Card Assistance
- Complete Documentation Support
- IELTS / PTE Guidance
- ప్రతి దశలో నిపుణుల సహాయం
- పారదర్శకమైన మరియు విశ్వసనీయ సేవలు

మీ భవిష్యత్తు... మీ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది!

విదేశాల్లో స్థిరపడటం ఒక అదృష్టం కాదు. సరైన అర్హత, సరైన ప్రణాళిక, సరైన మార్గదర్శకత్వం ఉంటే మీ అంతర్జాతీయ భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చు.

ఈరోజే మీ అర్హతను తెలుసుకోండి. సరైన నిర్ణయం తీసుకోండి. మీ కలల భవిష్యత్తు వైపు తొలి అడుగు వేయండి.



...సంప్రదించండి....

MD. జహంగీర్
Immigration Adviser
Exxeella Immigration Services
89779 44266
jahangirmd@exxeella.com
www.exxeella.com

**"మీ అర్హతే... మీ విదేశీ భవిష్యత్తును నిర్మించే మొదటి మెట్టు!"**



# 23 వేల ప్రభుత్వ పాఠశాలల మూసివేత ప్రతిపాదనను విరమించుకోవాలి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేధావుల బహిరంగ లేఖ**

హైదరాబాద్, జూలై 7

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను 27 వేల నుంచి 4 వేలకే పరిమితం చేయాలన్న ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రముఖ విద్యావేత్తలు, పదవీ విరమణ పొందిన న్యాయమూర్తులు, అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రికి బహిరంగ లేఖను అందజేశారు. ఈ లేఖపై మాజీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి. చంద్రకుమార్, జస్టిస్ రాధారాణి, ప్రొఫెసర్లు జి. హరగోపాల్, ఎం. కోదండరామ్, కె. నాగేశ్వర్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, గోరెటి వెంకన్న తదితరులు సంతకాలు చేశారు. జూన్ 6న బెంగళూరులో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలోని సుమారు 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం విద్యా వ్యవస్థపైనా, సమాజంపైనా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమలైతే విద్యా హక్కు చట్టం (=అస్త్రష్ట్ శీ జు౯బఘ్ఆశీఅ ాాష్) కింద ప్రతి చిన్నారికి ఉన్న ఉచిత, నిర్బంధ విద్య హక్కుకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. అనేక గ్రామ పంచాయతీల్లో సమీపంలో ప్రభుత్వ పాఠశాలలు లేకుండా పోతాయని, ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాల పిల్లలు, బాలికల విద్య తీవ్రంగా దెబ్బతింటుందని హెచ్చరించారు. దీంతో పాఠశాల మానివేతలు పెరగడంతో పాటు బాల కార్మిక వ్యవస్థ కూడా పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి డిమాండ్ లేకపోవడం కారణం కాదని, పరిపాలనా లోపాలే ప్రధాన కారణమని మేధావులు అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 15 శాతం కేటాయిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని వారు గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం కాకుండా వాటిని బలోపేతం చేసి, నాణ్యమైన ప్రభుత్వ విద్యను అందించే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మేధావులు తమ బహిరంగ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## పోషకాహార పథకాలతో ఆరోగ్య తెలంగాణ లక్ష్యం

### సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 7

విద్యార్థులు, గర్భిణీలు, మహిళలకు పోషకాహారం అందించే పలు సంక్షేమ పథకాల అమలు ద్వారా తెలంగాణను ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో నూతన బాలామృతం తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గర్భిణీల పోషణ కోసం మాజీ ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ మహబూబ్‌నగర్ జిల్లాలో బాలామృతం కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని, ఇప్పుడు అది ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందడం ఆనందదాయకమని పేర్కొన్నారు. నూతన బాలామృతం ప్లాంట్ ద్వారా గర్భిణీలకు మరింత నాణ్యమైన పోషకాహారం అందుతుందని సీఎం తెలిపారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకూడదనే ఉద్దేశంతో అల్పాహార పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యపై చేసే ఖర్చును వ్యయంగా కాకుండా పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం అన్నారు. ఈ సంక్షేమ కార్యక్రమాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాదని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నుంచి మంత్రి సీతక్క వరకు మహిళలు రాజకీయాల్లో తమ ప్రతిభను చాటుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.




# మహిళ వేధింపుల కేసులో రూ.70 వేల జరిమానా

పాలకవీడు, జూలై 6



బైండ్ ఓవర్ (సత్ప్రవర్తన గ్యారెంటీ) నిబంధనలను ఉల్లంఘించి మహిళను వేధించిన వ్యక్తికి రూ.70 వేల జరిమానా విధించినట్లు పాలకవీడు ఎస్ఐ కోటేష్ తెలిపారు. పాలకవీడు మండలం యల్లాపురం గ్రామానికి చెందిన షేక్ హాకీం గత కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన ఓ మహిళను వేధిస్తున్నాడని, బాధితురాలి ఫిర్యాదు మేరకు గతంలోనే పాలకవీడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం నిందితుడి ప్రవర్తనలో మార్పు తీసుకురావడం, గ్రామంలో శాంతిభద్రతలు కాపాడడం కోసం పాలకవీడు తహశీల్దార్ ఎదుట సత్ప్రవర్తన గ్యారెంటీపై బైండ్ ఓవర్ చేసినట్లు వెల్లడించారు. అయితే, బైండ్ ఓవర్ నిబంధనలను పట్టించుకోకుండా నిందితుడు మరోసారి అదే మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పోలీసులు తిరిగి కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడు బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించినట్లు ఎస్ఐ సమర్పించిన నివేదిక ఆధారంగా అతనికి రూ.70 వేల జరిమానా విధించారని, ఆ మొత్తాన్ని వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేష్ మాట్లాడుతూ, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై, ముఖ్యంగా మహిళల భద్రతకు భంగం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# సర్ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయి

## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీజేపీ ఫిర్యాదు



హైదరాబాద్, జూలై 7

రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వెంటనే జోక్యం చేసుకుని పారదర్శకంగా, నిష్పాక్షికంగా ప్రక్రియ నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈఓ)కు వినతి పత్రం సమర్పించింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలో, పార్టీ ఎన్నికల సంఘం వ్యవహారాల కమిటీ చైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి తదితర నాయకులు సీఈఓను కలిసి పలు అంశాలను ప్రస్తావించారు. హైదరాబాద్ పాతబస్తీలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎనయూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాల్సిన నిబంధనలను పాటించ కుండా, ఎంఐఎం నాయకులు నిర్వహిస్తున్న శిబిరాల ద్వారా ఫారాలు పంపిణీ చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది. అలాగే నింపిన ఎనయూమరేషన్ ఫారాలను ఎన్నికల సంఘం యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఎంఐఎం నాయకు లకు యాప్ యాక్సెస్ కల్పిస్తున్నారని పేర్కొంది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, వరంగల్, కరీం నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనేక మంది ఓటర్లకు ఇంటింటి ధృవీకరణ సక్రమంగా జరగక పోవడంతో ఎనయూమరేషన్ ఫారాలు అందలేదని తెలిపింది. ప్రతి ఇంటికీ బీఎల్ఓలు తప్పనిసరిగా వెళ్లి ఫారాలు పంపిణీ చేయడంతో పాటు, ఇంట్లో లేని ఓటర్ల ఇళ్లను మళ్లీ సందర్శించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ ప్రక్రియను పర్యవేక్షకులు సమర్థవంతంగా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేసింది. తెలంగాణ వ్యాప్తంగా ఎనయూమరేషన్ ఫారాలు ఆంగ్ల భాషలో కూడా అందుబాటులో ఉంచాలని బీజేపీ కోరింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలసదారులు తెలుగు చదవలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. కొంతమంది ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు) కొత్త ఓటరు నమోదు, ఓటరు బదిలీకి సంబంధించిన చట్టబద్ధ దరఖాస్తులను స్వీకరించడం లేదని, మరికొందరు ఎనయూమరేషన్ ఫారాలను అప్‌లోడ్ చేయడంలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని చెబుతున్నారని బీజేపీ ఆరోపించింది. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, ఎన్నికల అధికా రులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను స్వేచ్ఛాయుతంగా, నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కోరింది.

# రూ.338 కోట్ల హామ్ రోడ్ల పనులకు శ్రీకారం

**ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్, ఎల్బీనగర్ నియోజకవర్గాల్లో 149 కి.మీ. మేర 14 రహదారి ప్రాజెక్టులు**

హైదరాబాద్, జూలై 7

రాష్ట్రంలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మంగళవారం రూ.338 కోట్ల వ్యయంతో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) కింద చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇబ్రహీంపట్నం మండలం తొర్రూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన 149 కిలోమీటర్ల మేర 14 రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా నిర్వహిం చిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంద న్నారు. దేశానికి ఆదర్శంగా నిలిచే నాణ్యమైన రహదారులను నిర్మించడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద రహదారి ఆధునీకరణ కార్యక్రమాల్లో ఒకటి అమలవు తోందని మంత్రి తెలిపారు. హామ్ విధానంలో 34 ప్యాకేజీల ద్వారా 6,092 కిలోమీటర్ల పొడవున 441 రహదా రులను రూ.13 వేల కోట్ల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించా రు. ప్రస్తుతం ప్రారంభించిన రూ.338 కోట్ల పనులు కూడా అదే కార్యక్రమంలో భాగమని చెప్పారు. ఈ ప్యాకేజీ కింద హయత్‌నగర్–తొర్రూరు–కొహెడ–అనాజ్‌పూర్, అనాజ్‌పూర్–అబ్దుల్లాపూర్‌మెట్–బందర విర్యాల్, హయత్‌నగర్– కుంట్లూరు– పసుమాముల– తారామతి పేట్, సాగర్ రోడ్–ఇంజాపూర్– తొర్రూరు– బ్రాహ్మణపల్లి– రాగన్నగూడ, సాగర్ రోడ్–ఇంజాపూర్–హయత్‌నగర్ మార్గాలను ఆధునిక నాలుగు లేన్ల రహదారు లుగా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. వీటిలో సెంట్రల్ లైటింగ్‌తో పాటు ఆధునిక భద్రతా ప్రమాణాలు కల్పించనున్న ట్లు తెలిపారు. ఈ రహదారి ప్రాజెక్టులు పూర్తయితే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు రోడ్డు భద్రత మెరుగుపడుతుందని, ప్రాంతీయ అనుసంధానం బలోపేతం కావడంతో ఉపాధి, పెట్టుబడుల అవకాశాలు కూడా పెరుగుతాయని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధికి బలమైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కు మార్ రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రహదారు లు, విద్య, వైద్యం తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు.

# అభయాంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ

కోదాడ, జూలై 7



కోదాడ పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో 204వ మంగళవారం సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలు పి. లక్ష్మారెడ్డి, జానకమ్మతో పాటు ఇతర దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆంజనేయ స్వామి కరుణా కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సుభిక్షాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, అన్నదాన నిర్వాహకులు డి. హనుమంతరావు, వి. కృష్ణమూర్తి, కార్యదర్శి తిరుపతయ్య, శిరీష, బ్యాటరీచారి ఉమామహేశ్వరరావు, పెద్దిశేషు, ఆకుల పుల్లారావు, క్రాంతి, బీఎల్ఎన్ రెడ్డి, బి. సత్యం, వి. రామారావు, కె. రవికుమార్, డాక్టర్ శ్రీకాంత్, పి. శ్రీనివాసరావు, రామకృష్ణ, పవన్, సతీష్, రంగా, శ్రీను, ప్రకాష్, లక్ష్మారెడ్డి, నరేష్, గాంధీ, వి. రాంప్రసాద్, వెంకటకృష్ణ, విశాల్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



# దళిత నేతకు జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, జూలై 7

పద్మశ్రీ డా. మందకృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ తెలంగాణ దళిత క్రైస్తవ రాష్ట్ర నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్ మంగళవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ, 1965 జూలై 7న జన్మించిన మందకృష్ణ మాదిగ అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం జీవితాంతం పోరాడిన ఉద్యమ నాయకుడని అన్నారు. 1980ల నుంచే కుల వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టిన ఆయన, 1994లో ఎమ్మార్పీఎస్ (మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి)ను స్థాపించి ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం, వికలాంగుల హక్కులు, బాలల ఆరోగ్యం, ఉచిత గుండె శస్త్రచికిత్సలు వంటి అనేక ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు. కరంచేడు, చుండూరు ఘటనల అనంతరం దళితుల హక్కుల కోసం దేశవ్యాప్తంగా బలమైన పోరాటానికి ఆయన నాయకత్వం వహించారని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరుగు సంసోన్, సూర్యాపేట నియో జకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ. డా.జలగం జేమ్స్, బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

# ఓటర్ల సందేహాల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు!

**ఓటరు జాబితా పరిశీలన, ఫారమ్‌ల భర్తీపై నివృత్తి**

సూర్యాపేట జూలై 8

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట జిల్లాలో ఎస్ఐఆర్--2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ ప్రక్రియలో భాగంగా ప్రజలకు ఎదురయ్యే సందేహాలను తీర్చేందుకు, ఎన్యుమరేషన్ ఫారమ్ నింపే విధానంపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టరేట్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. 2002 ఓటరు జాబితాలో వివరాల పరిశీలనతో పాటు ఇతర సాంకేతిక ఇబ్బందుల పరిష్కారానికి ఈ కేంద్రం నిరంతరం అందుబాటులో ఉంటుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ తెలిపారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు లేదా ఎస్ఐఆర్ ప్రక్రియపై ఏవైనా సందేహాలు ఉంటే ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేయాలని జిల్లా ఎన్నికల యంత్రాంగం సూచించింది.



# అధిక ఫీజులు నియంత్రించాలి

**బీఆర్ఎస్వీ వినతి**

సూర్యాపేట, జూలై 7

సూర్యాపేట జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ డి. ప్రేమ్‌రాజుకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకుడు బంటు సందీప్ మాట్లాడుతూ, జిల్లాలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. స్టేషనరీ పేరుతో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ విక్రయించడమే కాకుండా, ఐఐటీ, జేఈఈ మెయిన్, నీట్ తదితర కోర్సుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి వేలాది రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.

# కన్నెపల్లి పంప్ హౌస్‌ను వెంటనే ప్రారంభించాలి

## బీఆర్ఎస్ ఆందోళన



**సూర్యాపేట, జూలై 7**

కన్నెపల్లి పంప్ హౌస్‌ను తక్షణమే ప్రారంభించి, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేసి ఎండిపోతున్న ఆయకట్టును కాపాడాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట రైతులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఆందోళన నిర్వహించారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ ముఖ్య నాయకుల నేతృత్వంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రైతులు, పార్టీ శ్రేణులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని, వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ప్రతి ఏడాది సకాలంలో సాగునీరు అందించి రైతాంగాన్ని ఆదుకున్నామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణితో కన్నెపల్లి పంప్ హౌస్ పునరుద్ధరణను నిర్లక్ష్యం చేస్తూ కాళేశ్వరం జలాలను నిలిపివేస్తోందని ఆరోపించారు. రైతుల పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, కన్నెపల్లి పంప్ హౌస్ ద్వారా వెంటనే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ కావాలనే జాప్యం చేస్తూ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని మండిపడ్డారు. కన్నెపల్లి పంప్ హౌస్‌ను యుద్ధప్రాతిపదికన ప్రారంభించి ఆయకట్టుకు వెంటనే నీటిని విడుదల చేయాలని, సాగునీటి విషయంలో రాజకీయాలకు తావివ్వకుండా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ముట్టడితో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గోదావరి జలాలను విడుదల చేయకపోతే, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని ఏకం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు.

# మునగాల పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

### బాధితులకు భరోసా -- జాతీయ రహదారిపై నిరంతర పెట్రోలింగ్‌కు ఆదేశాలు

**మునగాల, జూలై 7**

సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మంగళవారం మునగాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు సేవల నాణ్యత, ఫిర్యాదుల పరిష్కార విధానం, రికార్డుల నిర్వహణ, సాంకేతిక వినియోగం, శాంతిభద్రతల పరిరక్షణపై సమగ్రంగా పరిశీలించి సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించిన ఎస్పీ, స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడిని గౌరవంగా స్వాగతిస్తూ, వారి ఫిర్యాదులను వేగంగా స్వీకరించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై మరింత విశ్వాసం పెరిగే లా వ్యవహరించాలని సూచించారు. అనంతరం స్టేషన్ పరిస రాలు, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల స్థితి, సీసీ కెమెరాల నిర్వహణ, సమస్యాత్మక వ్యక్తుల




రికార్డులు, సాంకేతిక పరిజ్ఞానం వినియో గాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణ లో మరింత సమర్థత కనబరిచి ఆధునిక పోలీసింగ్‌కు అనుగు ణంగా ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. జాతీయ రహదారిపై రాత్రింబవళ్లు నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రమాదాల నియంత్రణతో పాటు ప్రయాణి కుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ సంద ర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందిస్తూ బాధితులకు భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, నేరాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై పోలీస్ శాఖ నిరంతర నిఘా కొనసాగి స్తోందని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, ఏఎస్పై రత్నం తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### క్యూర్-2026 చట్టం.. పాత జీహెచ్‌ఎంసీ ప్రాంతాల్లో

# ఆస్తిపన్ను పెంపునకు ప్రతిపాదన

**హైదరాబాద్, జూలై 7**

తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ముసాయిదా క్యూర్-2026 చట్టంలో ఆస్తిపన్ను విధానంలో కీలక మార్పులకు ప్రతిపాదనలు చేసింది. ముఖ్యంగా పాత జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆస్తులపై ప్రస్తుతం అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి బదులుగా మూలధన విలువ ఆధారంగా పన్ను వసూలు చేయాలని ప్రతిపాదించింది. ఈ మార్పు తో అనేక ప్రాంతాల్లో ఆస్తిపన్ను భారం గణనీ యంగా పెరిగే అవకాశం ఉందని అధికా రులు అంచనా వేస్తున్నా రు. ప్రతిపాదిత విధానం అమల్లోకి వస్తే మార్కెట్ విలువ ఆధారంగా పన్ను లెక్కించబడు తుంది. దీంతో చాలా మంది ఆస్తి యజమా నులకు ప్రస్తుతం చెల్లిస్తున్న పన్నుతో పోలిస్తే దాదాపు రెట్టింపు వరకు పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటు న్నాయి. అయితే,




సకాలంలో పన్ను చెల్లించే వారికి రాయితీలు కల్పించడంతో పాటు పాతబడి న కొన్ని స్థానిక పన్నులను రద్దు చేయాలని కూడా ముసాయిదా బిల్లు లో సూచించారు క్యూర్-2026 చట్టం ద్వారా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజి యన్‌కు సమగ్ర పట్టణ పాల నా వ్యవస్థను తీసుకురా వడమే లక్ష్యమని ప్రభుత్వం వెల్లడించింది. ముసాయిదా బి ల్లుపై ప్రజలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసి యేషన్లు, పరి శ్రమల ప్రతి నిధులు తది తరులు జూలై 24 వరకు తమ అభిప్రా యాలు, సూ చనలు తెలియ జేయవచ్చని ప్రభుత్వం తెలిపింది. తుది నిర్ణయం అనంతరం చట్టం అమలులోకి వచ్చే అవకా శం ఉంది.

## భార్యపై అసహజ లైంగిక వేధింపులు.. భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష

**హైదరాబాద్, జూలై 7**

భార్యపై నిరంతరం శారీరక, లైంగిక వేధింపులకు పాల్పడిన భర్తకు హైదరాబాద్‌లోని కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. అలాగే రూ.5 వేల జరిమానా కూడా విధించింది బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భర్త వివాహానంతరం భార్యపై అసహజ లైంగిక చర్యలకు పాల్పడుతూ, శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసినట్లు అభియోగాలు రుజు వయ్యాయి. ఈ నేపథ్యంలో కోర్టు నిందితుడిని దోషిగా తేల్చి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. ఈ కేసులో దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు బాధితురాలిపై జరిగిన వేధింపులు తీవ్ర స్వరూపమైనవని పేర్కొంటూ ఈ తీర్పును వెలువరించింది. మహిళలపై గృహహింస, లైంగిక వేధింపుల కేసుల్లో నేరస్తులపై చట్టం కఠినంగా వ్యవహరిస్తుందనే సందేశాన్ని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

# ఖాసీం ఖాన్‌ను మరచిన కాంగ్రెస్ నాయకత్వం?

### త్యాగం చేసిన నేతకు సరైన గుర్తింపు లేదని కార్యకర్తల ఆవేదన

**మునగాల:, జూలై 7 :**

ఒకప్పుడు జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తూ పార్టీ బలోపేతం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఖాసీం ఖాన్‌ను కాంగ్రెస్ పార్టీ క్రమంగా మరచిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మునగాల మండలం నరసింహుల గూడెం గ్రామానికి చెందిన ఖాసీం ఖాన్, ఆ ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేసిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆ సమయంలో గ్రామంలో సీపీఎం ప్రభావం అధి కంగా ఉన్న నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ తరఫున ఖాసీం ఖాన్ ధైర్యంగా పోరాటం సాగించారు. గ్రామంలో కాంగ్రెస్‌ను బలమై న రాజకీయ శక్తిగా నిలబెట్టేందుకు నిరంతరం శ్రమించిన ఆయన, రాజకీయ ఘర్షణల నేపథ్యంలో సీపీఎం కార్యకర్తల చేతిలో హత్యకు గురైనట్లు అప్పటి నాయకులు, కార్యకర్తలు గుర్తు చేస్తున్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా పూర్తిగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, పార్టీ అభివృద్ధి కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని వారు పేర్కొంటు న్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షు డిగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ, ప్రస్తుతం పార్టీ కార్యక్రమాల్లో ఖాసీం ఖాన్ పేరును ప్రస్తావించకపోవడం, ఆయన వర్ధంతి లేదా జయంతిని అధికారికంగా నిర్వహించకపోవడం పట్ల కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన నాయకుడికి కనీస గుర్తింపు కూడా దక్కకపోవడం బాధాకరమని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడు తున్నారు. ఖాసీం ఖాన్ మైనారిటీ వర్గానికి చెందిన నాయకుడు కావడం వల్లనే ఆయనకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదనే అభిప్రాయాన్ని కొందరు మైనారిటీ నాయకులు వ్యక్తం చేస్తు న్నారు. పార్టీ కోసం ప్రాణత్యాగం చేసిన నాయకుల సేవల ను గుర్తించి వారికి తగిన గౌరవం ఇవ్వకపోతే భవిష్యత్తు లో పార్టీ కోసం త్యాగాలు చేసే నాయకులు ముందుకు రావడం కష్టమ వుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకత్వం స్పందించి ఖాసీం ఖాన్ సేవలను అధికా రికంగా గుర్తిం చాలని, ప్రతి సంవత్సరం ఆయన వర్ధంతిని నిర్వహిస్తూ యువతకు ఆయన త్యాగస్ఫూర్తిని పరిచ యం చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు డిమాండ్ చేస్తున్నారు.

## గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తెలంగాణ.. హైదరాబాద్‌కు 15 విదేశీ విశ్వవిద్యాలయాలు

**హైదరాబాద్, జూలై 7**

తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. హైదరాబాద్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాలకు చెందిన సుమారు 15 ప్రముఖ విదేశీ విశ్వవిద్యాలయాలు ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న "గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్" ప్రణాళికలో భాగంగా ఈ విశ్వవిద్యాలయాల ప్రతినిధులతో ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ఉన్నత విద్య, పరిశోధన, అంతర్జాతీయ ప్రమాణాల బోధనను తెలంగాణలోనే అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్య క్రమం ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం భావిస్తోంది. విదేశీ విశ్వ విద్యాలయాలు హైదరాబాద్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర విద్యార్థులకు విదేశా లకు వెళ్లకుండానే అంత ర్జాతీయ స్థాయి విద్యను అభ్యసించే అవకాశం లభించనుంది. అలాగే పరిశోధన, ఆవిష్కరణలు, నైపుణ్యాభి వృద్ధి, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ఐటీ, ఫార్మా, ఏరోస్పేస్ రంగాల్లో ఇప్పటికే దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్‌ను ఇప్పుడు అంతర్జాతీయ ఉన్నత విద్యా కేంద్రంగా కూడా అభివృద్ధి చేయాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ దిశగా అవసరమైన మౌలిక సదుపాయాలు, విధానపరమైన ప్రోత్సాహకాలు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది.

## పీఎంఏవై-యూ 2.0 కింద తెలంగాణకు మరో 8,338 ఇళ్ల మంజూరు

### తొలి విడతగా రూ.50.02 కోట్ల విడుదలకు కేంద్రం ఆమోదం

**హైదరాబాద్, జూలై 7**

పట్టణ ప్రాంతాల్లోని పేదలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన--పట్టణ (PMAY-U 2.0) పథకం కింద తెలంగాణకు అదనంగా 8,338 ఇళ్లను మంజూరు చేసింది. ఈ ఇళ్ల నిర్మాణానికి రూ.125.07 కోట్ల కేంద్ర సహాయాన్ని ఆమోదించగా, తొలి విడతగా రూ.50.02 కోట్లను విడుదల చేయడానికి అనుమతి ఇచ్చింది. ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర శాంక్షనింగ్ అండ్ మానిటరింగ్ కమిటీ సమా వేశంలో తెలంగాణ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ వెల్లడించింది. అయితే కొత్త ఇళ్లను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్రంలో పీఎంఏవై-యూ పథకం అమలు తీరు, నిధుల వినియోగంలో జాప్యంపై కేంద్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. పాత పథకం కింద పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మా ణాలను సెప్టెంబర్ 30లోపు పూర్తి చేయాలని ఆదేశించింది. గడువు దాటితే ఆ పనులకు కేంద్రం నుంచి అదనపు ఆర్థిక సహాయం అందకపోవచ్చని హెచ్చరించింది. ఇప్పటికే కేటాయించిన నిధుల్లో రాష్ట్రం తక్కువ మొత్తాన్నే వినియోగించిందని కేంద్రం పేర్కొంది. అలాగే మంజూరైన లబ్ధిదారులందరికీ సకాలంలో ఆర్థిక సాయం అందేలా చర్యలు వేగవంతం చేయాలని సూచించింది. ఇళ్ల నిర్మాణంతో పాటు తాగునీరు, విద్యుత్, రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కూడా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం స్పష్టం చేసింది.

## మహబూబ్‌నగర్‌లో రూ.400 కోట్లతో నూతన ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు లేఅవుట్‌కు ఆమోదం

**హైదరాబాద్, జూలై 7**

తెలంగాణలో ఉన్నత విద్యా రంగానికి మరింత ఊతమిచ్చేలా మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు కానున్న నూతన ట్రిపుల్ ఐటీ (RGUKT) శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సుమారు రూ.400 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్యాంపస్‌కు సంబంధించిన లేఅవుట్‌కు అధికారులు ఆమోదం తెలిపారు. జడ్చర్ల మండలం చిట్టబోయినపల్లి సమీపంలో ప్రతిపాదించిన ఈ క్యాంపస్‌లో అత్యాధునిక విద్యా, వసతి, పరిశోధన సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థుల కోసం అకడమిక్ బ్లాక్‌లు, హాస్టళ్లు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, పరిపాలనా భవనాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పాలమూరు ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య స్థానికంగానే అందుబాటులోకి రానుంది. గ్రామీణ ప్రతిభావంతులైన విద్యార్థులకు అత్యున్నత విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేస్తోంది. ప్రభుత్వం ఇప్పటికే ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు శంకుస్థాపన నిర్వహించగా, ఇప్పుడు లేఅవుట్ ఆమోదం లభించడం వల్ల నిర్మాణ పనులు వేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్యాంపస్ మహబూబ్‌నగర్ జిల్లాను ఉన్నత విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించనుందని అధికారులు భావిస్తున్నారు.

# మానవతా దృక్పథంతో సైబర్ బాధితులకు సేవలు అందించాలి

## ఎస్పీ నరసింహ

**సూర్యాపేట, జూలై 7**

సైబర్ నేరాల బాధితులకు మానవతా దృక్పథంతో సేవలు అందిస్తూ, వారు కోల్పోయిన నగదు త్వరగా తిరిగి పొందేలా కృషి చేయాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ జిల్లా పోలీసు సిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా పరిధిలోని సైబర్ వారియర్ పోలీసు సిబ్బందికి "సైబర్ క్రైమ్ వర్టికల్ ట్రైనింగ్" పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సైబర్ నేరాలపై సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకుని, జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్‌తో సమన్వయంగా పనిచేస్తూ మోసగాళ్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పిస్తూ, ఆర్థిక నష్టాన్ని వీలైనంత త్వరగా రికవరీ చేసి అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణలో జాతీయ స్థాయి సైబర్ యాప్‌లు, సాంకేతిక దర్యాప్తు విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలను ఉద్దేశించి ఎస్పీ పలు సూచనలు చేశారు. అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీలు లేదా ఇతర వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దన్నారు. మొబైల్ లేదా ఈ-మెయిల్ ద్వారా వచ్చే




అనుమానాస్పద లింకులు, సందేశాలను నమ్మి డబ్బులు పంపవద్దని హెచ్చరించారు. బ్యాంకు అధికారులు ఫోన్ ద్వారా ఖాతా వివరాలు అడగరని గుర్తుంచుకోవాలని తెలిపారు. అలాగే ఉచిత బహుమతులు, లాటరీలు, తక్కువ ధరలకు వాహనాలు లేదా వస్తువులు ఇస్తామని వచ్చే ప్రకటనలు ఎక్కువగా సైబర్ మోసాలేనని పేర్కొన్నారు. అధికారులు, ప్రముఖుల పేర్లతో నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించి డబ్బులు అడిగే మోసగాళ్లను నమ్మవద్దని, అలాంటి సందేశాలు వచ్చిన వెంటనే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్పీ నరసింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, టెక్ టీమ్ ఆర్ఎస్ఐ రాజశేఖర్‌తో పాటు సైబర్ వారియర్ సిబ్బంది పాల్గొన్నారు.






## సింగరేణికి తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ కేటాయింపు హర్షణీయం

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూలై 7**

సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కొత్త బొగ్గు గనులను సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేసిన నిరంతర కృషికి ఫలితం దక్కిందని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సింగరేణికి తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించినట్లు ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, 2024 మార్చి 7న ఢిల్లీలో అప్పటి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి తాడిచెర్ల-2 బ్లాక్‌ను సింగరేణికి కేటాయించాలని కోరినట్లు తెలిపారు. అనంతరం అదే ఏడాది జూన్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన బొగ్గు బ్లాక్‌ల వేలం సందర్భంగా ప్రస్తుత కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని మరోసారి కలిసి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అలాగే 2024 నవంబర్ 27న కూడా ఈ అంశంపై మరోసారి కేంద్రాన్ని కోరినట్లు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కూడా ప్రధాని నరేంద్ర మోదీని కలిసి తాడిచెర్లతో పాటు ఇతర బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు భట్టి పేర్కొన్నారు. రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగానే తాడిచెర్ల-2 బ్లాక్ కేటాయింపు సాధ్యమైందని, ఇది సింగరేణి సంస్థ భవిష్యత్తు స్థిరత్వానికి ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. సింగరేణి పరిధిలోని మరిన్ని బొగ్గు బ్లాక్‌లను కూడా కేంద్ర ప్రభుత్వం కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో అనుమతుల లేమితో నిలిచిపోయిన ఒడిశాలోని నైనీ బొగ్గు గనిని ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పునరుద్ధరించి, అవసరమైన అనుమతులు పొందడంతో పాటు స్థానిక ప్రజల సహకారంతో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించినట్లు భట్టి వివరించారు. ఇప్పుడు తాడిచెర్ల-2 బ్లాక్ కూడా సింగరేణికి దక్కడం మరో ముఖ్యమైన విజయమని పేర్కొన్నారు.

## 'భూ భారతి' కుంభకోణాన్ని ప్రభుత్వం కప్పిపుచ్చుతోంది

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**హైదరాబాద్, జూలై 7**

భూ భారతి కుంభకోణంలో బాధ్యులను తెలంగాణ ప్రభుత్వం కాపాడుతోందని, ఏడు నెలల క్రితం సమగ్ర విచారణ చేస్తామని చెప్పినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి దర్యాప్తు పూర్తి కాలేదని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జనగామ జిల్లాలోని 38 మీ సేవా కేంద్రాల నిర్వాహకులు సాఫ్ట్‌వేర్‌లో అక్రమ మార్పులు చేసి రైతుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి, ప్రభుత్వానికి మాత్రం నామమాత్రపు ఫీజులు మాత్రమే జమ చేసి కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చిన్న విషయంగా కొట్టిపారేశారని, సమగ్ర విచారణకు హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రజలను మోసగించడంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇద్దరూ "పీహెచ్‌డీ" సాధించినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు.

## జనగామలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఆత్మహత్య

**జనగామ, జూలై 7**

జనగామ జిల్లా కేంద్రంలో ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు 20 పేజీల లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. మృతుడు పగిడిపల్లి మల్లయ్యగా పోలీసులు గుర్తించారు. తన మరణానికి తెలంగాణ ప్రభుత్వం, బావమరిది, కొందరు బంధువులు బాధ్యులని లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, మల్లయ్య పదవీ విరమణ అనంతరం రావాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాలు, ముఖ్యంగా జీపీఎఫ్ నిధులు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో బంధువులకు ఇచ్చిన డబ్బులు తిరిగి రాక తీవ్ర మనోవేదనకు గురైనట్లు సమాచారం. ఈ అంశాలనే తన లేఖలో ప్రస్తావించినట్లు తెలుస్తోంది. న్యాయం కోసం కోర్టును కూడా ఆశ్రయించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని, తన లేఖలో ఒక హైకోర్టు న్యాయమూర్తి పేరును కూడా ప్రస్తావించినట్లు సమాచారం. అయితే ఆ లేఖలో చేసిన ఆరోపణలు ఇప్పటివరకు అధికారికంగా నిర్ధారణ కాలేదని, వాటిపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలంలో లభించిన 20 పేజీల లేఖను స్వాధీనం చేసుకుని, అందులో పేర్కొన్న అంశాలపై సమగ్ర విచారణ చేపట్టారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు సన్మానం

**చిలుకూరు, జూలై 7**



ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను చిలుకూరు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాదిగ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, విద్యార్థినులను సాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా సాగిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అనేక మంది మాదిగ బిడ్డలు ప్రాణత్యాగాలు చేశారని గుర్తు చేశారు. జాతి ఎదుర్కొంటున్న అన్యాయాలు, వివక్షలను గుర్తించి వాటి నిర్మూలన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ప్రారంభమైన మాదిగ దండోరా ఉద్యమం 31 సంవత్సరాలు పూర్తి చేసుకుని 32వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ ఒకే వర్గానికే కాకుండా అన్ని సబ్బండ వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం నిరంతరం ఉద్యమిస్తున్నారని, ఎన్నో అవరోధాలు ఎదురైనా ఉద్యమ లక్ష్యాల సాధనలో వెనుకడుగు వేయలేదని కొనియాడారు. అనేక మంది త్యాగాలతో సాధించిన ఏబీసీడీ వర్గీకరణ ఫలాలను జాతిలోని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు విద్యలో రాణించి వర్గీకరణ ద్వారా లభించే అవకాశాలను వినియోగించుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, చిలుకూరు మండ ల ఇన్‌చార్జి కొండపల్లి ఆంజనేయులు మాదిగ, మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు మాదిగ, జిల్లా నాయకుడు సిద్దుల శ్రీనివాస్ మాదిగ, గ్రామ శాఖ అధ్యక్షుడు కాంపాటి రంజిత్ మాదిగ, ఎంజేఎఫ్ మండల అధ్యక్షుడు కందుకూరి కృష్ణమూర్తి, కోశాధికారి నూకపంగు వీరబాబు, మాజీ అధ్యక్షుడు కాంపాటి గురవయ్య, 13వ వార్డు సభ్యురాలు కందుకూరి స్వప్న నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు కందుకూరి రాకేష్, సీనియర్ నాయకులు సిద్దెల ప్రభాకర్, మల్లెపం గు శోభన్, కందుకూరి సైదులు, శివ తదితరులు పాల్గొన్నారు.

## వలస కార్మికుల పిల్లల చెంతకే అంగన్వాడీ సేవలు

**హైదరాబాద్, జూలై 7**

ఉపాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివసిస్తున్న వలస కార్మికుల చిన్నారులకు అంగన్వాడీ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో మొబైల్ అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించింది. నిర్మాణ పనులు, పరిశ్రమలు, ఇతర ఉపాధి రంగాల్లో పనిచేస్తున్న వలస కార్మికుల పిల్లలు సాధారణ అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లలేని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ మొబైల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కార్మికులు పనిచేసే ప్రాంతాలకే ప్రత్యేక వాహనాల ద్వారా చేరుకుని చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు, టీకాలు, ప్రీ-స్కూల్ విద్య, ఎదుగుదల పర్యవేక్షణ వంటి సేవలను అందించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడంతో పాటు, వలస కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ సేవలను మరింత చేరువ చేయడం లక్ష్యంగా అధికారులు తెలిపారు. జిల్లాలోని అవసరమైన ప్రాంతాల్లో ఈ మొబైల్ అంగన్వాడీ సేవలను దశలవారీగా విస్తరించే యోచనలో ప్రభుత్వం ఉంది.

# భూదాన్ రెడ్డి ఇకలేరు

## విలువల రాజకీయాలకు వీడ్కోలు

## మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి కన్నుమూత



నిరాడంబర రాజకీయాలకు, ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మంగళవారం కన్నుమూశారు. హైదరాబాద్‌లో తన కుమార్తె నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు బుధవారం స్వగ్రామం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లిలో నిర్వహించనున్నారు. ప్రజల మధ్యే జీవించి, ప్రజల కోసమే తన జీవితాన్ని అంకితం చేసిన నర్సింహారెడ్డి మరణం తెలంగాణ రాజకీయాల్లో ఒక విలువల యుగానికి ముగింపుగా పలువురు అభివర్ణిస్తున్నారు. 1943 సెప్టెంబర్ 10న బ్రాహ్మణపల్లిలో జన్మించిన నర్సింహారెడ్డి సంపన్న కుటుంబంలో పుట్టారు.

- హైదరాబాద్/భువనగిరి, జూలై 7 (మన దీపం)

పన్నెండు మంది జీతగాళ్లు, రెండు అంతస్తుల ఇల్లు, ఎనిమిది గుర్రాలు, రెండు వందల ఆవులు, వందలాది గొర్రెలు, మేకలతో ఆ కుటుంబం అప్పట్లో గ్రామంలో ప్రముఖంగా ఉండేది. ఆయన తండ్రి రామచంద్రారెడ్డి పోలీస్ పటేల్‌గా పనిచేశారు. 1962 నుంచి 1970 వరకు వరుసగా ఎనిమిదేళ్లు బ్రాహ్మణపల్లి సర్పంచ్‌గా సేవలందించారు. 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రజా సమితి భువనగిరి తాలూకా కార్యదర్శిగా ఉద్యమానికి నాయకత్వం వహించారు. 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా భువనగిరి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీ రామారావు ప్రభంజనం వీచినా, భువనగిరిలో మాత్రం కాంగ్రెస్ తరఫున రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించి తన వ్యక్తిగత ప్రజాదరణను చాటుకున్నారు. 1985 మధ్యంతర ఎన్నికల సమయంలో ఎన్నికల ఖర్చు భరించే స్తోమత లేదని స్వయంగా పోటీ నుంచి తప్పుకోవడం ఆయన రాజకీయ నిజాయితీకి నిదర్శనం. రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసినా సొంత ఇల్లు, సొంత కారు లేకుండా అద్దె ఇంట్లోనే జీవించారు. సాధారణ బజాజ్ చేతక్ స్కూటర్ పైనే ప్రజల మధ్య తిరుగుతూ జీవితాన్ని గడిపారు. పదవిని సంపాదనకు కాదు, సేవకు ఉపయోగించిన అరుదైన నాయకుడిగా గుర్తింపు పొందారు. తన వాటాగా వచ్చిన సుమారు 300 ఎకరాల సాగుభూమిని పేదలకు పంచిపెట్టడం ఆయన జీవితంలో అత్యంత గొప్ప సేవగా నిలిచింది. అందులో కొంత భూమిని దళిత కుటుంబాలకు ఇచ్చి ప్రత్యేక కాలనీ ఏర్పాటుకు సహకరించారు. భూ సీలింగ్ చట్టం ప్రకారం మరో 80 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించారు. ఈ సేవల కారణంగా ప్రజలు ఆయనను ప్రేమగా "భూదాన్ రెడ్డి" అని పిలిచేవారు. భువనగిరి, ఆలేరు ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై బ్యారేజీ నిర్మించాలని నిరంతరం పోరాటం చేశారు. గోదావరి జలాలను మూసీ నదిలోకి మళ్లించి లక్ష ఎకరాలకు సాగునీరు అందించే సమగ్ర ప్రణాళికను స్వయంగా రూపొందించి ప్రజలకు, అధికారులకు వివరించారు. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో మూసీ నది కాలుష్య నిర్మూలన కోసం జీవితాంతం ఉద్యమించారు. 2013లో బీబీనగర్ నిమ్స్ ఆసుపత్రిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ప్రజా ప్రయోజనాల విషయంలో రాజీపడని నాయకుడిగా నిలిచారు. పేదలకు భూములు పంచడం, మిగిలిన భూమిని అమ్మి పిల్లలకు ఉన్నత విద్య అందించడం, చివరకు బొల్లేపల్లి కాలువ నిర్మాణంలో కోల్పోయిన భూమికి పరిహారం కూడా అందకపోయినా ప్రజా సమస్యలపై పోరాటం మాత్రం ఆపలేదు. సొంత ఇల్లు నిర్మించుకోవడానికి రావాల్సిన పరిహారం కోసం ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లను కలిసి ఎన్నో వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండానే జీవితాన్ని ముగించారు. ఆయన భార్య సుకన్యమ్మ రెండేళ్ల క్రితం కన్నుమూశారు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొమ్మిడి నర్సింహారెడ్డి మరణంతో తెలంగాణ ఒక విలువల రాజకీయ నాయకుడిని కోల్పోయిందని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యమకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కోసం ఆస్తిని త్యాగం చేసి, పదవిని సేవకు అంకితం చేసిన ఆయన జీవితం భావితర రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొంటున్నారు.




# ‘సత్లుజ్’పై రామ్‌గోపాల్ వర్మ ప్రశంసలు

**ప్రముఖ నటుడు, గాయకుడు దిల్జీత్ దోసాంజ్ ప్రధాన పాత్రలో రూపొందిన ‘సత్లుజ్’ చిత్రం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తోంది. పంజాబ్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవిత కథ ఆధారంగా దర్శకుడు హనీ ట్రెహాన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. తొలుత ‘పంజాబ్ 95’ పేరుతో రూపొందిన ఈ చిత్రానికి సెన్సార్ మండలి అనేక కోతలు సూచించడంతో, థియేటర్లలో విడుదల చేయకుండా నేరుగా ఓటీటీ వేదికలో ‘సత్లుజ్’ పేరుతో విడుదల చేశారు.**

ముంబై, జులై 7

జులై 3న ప్రసారమైన ఈ చిత్రం, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు రోజులకే ఓటీటీ వేదిక నుంచి తొలగించబడింది. సమాచార సాంకేతిక నిబంధనల ఉల్లంఘనలు, భద్రతాపరమైన అంశాలను కారణంగా చూపుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రం భారత్ వెలుపల మాత్రమే అందుబాటులో ఉంది. ఈ పరిణామాన్ని తాను ముందే ఊహించానని దిల్జీత్ దోసాంజ్ సామాజిక మాధ్యమాల ద్వారా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ‘సత్లుజ్’ కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, దేశ చరిత్రలోని అత్యంత విషాదకరమైన అధ్యాయాన్ని గుర్తు చేసే గాఢమైన అనుభూతి అని పేర్కొన్నారు. దిల్జీత్ దోసాంజ్ ఎలాంటి హీరో యిజం ప్రదర్శించకుండా, నటనతో పాత్రకు పూర్తి న్యాయం చేశారని కొనియాడారు.


# ‘జైలర్-2’ హక్కులకు భారీ పోటీ

## విడుదలకు ముందే పెరిగిన అంచనాలు

చెన్నై, జులై 7

సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన ‘జైలర్’ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ చిత్రానికి తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ విశేష ఆదరణ లభించింది. ముఖ్యంగా మలయాళ మార్కెట్‌లో ఈ సినిమా భారీ వసూళ్లు సాధించి రజనీకాంత్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ చిత్రానికి కొనసాగింపుగా రూపొందుతున్న ‘జైలర్-2’పై అభిమానులతో పాటు సినీ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన విడుదల తేదీ ప్రత్యేక దృశ్యానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. దీంతో సినిమాపై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఈ సినిమా ప్రదర్శన హక్కుల కోసం పోటీ మొదలైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది.

ముఖ్యంగా కేరళలో ప్రముఖ పంపిణీ సంస్థలు ‘జైలర్-2’ ప్రదర్శన హక్కులను సొంతం చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. తొలి భాగం అక్కడ అనూహ్య విజయాన్ని నమోదు చేయడంతో రెండో భాగంపై కూడా వ్యాపార వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా తొలి చిత్రంలో మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో కనిపించడం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.





# కృత్రిమ మేధతో కథానాయిక

## సినీ రంగంలో కొత్త ప్రయోగం

లాస్ ఏంజెలెస్, జులై 7

సినీ పరిశ్రమలో సాంకేతికత రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. దృశ్య ప్రభావాలు, వర్చువల్ నిర్మాణం, డిజిటల్ పాత్రల తర్వాత ఇప్పుడు కృత్రిమ మేధ నేరుగా నటన రంగంలోకి అడుగుపెడుతోంది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి కృత్రిమ మేధ ఆధారిత కథానాయికతో రూపొందుతున్న ‘మిస్అలైండ్’ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినీ చరిత్రలోనే పూర్తిస్థాయి కృత్రిమ మేధ కథానాయికతో రూపొందుతున్న తొలి ప్రధాన చిత్రంగా దీనిని ప్రచారం చేస్తున్నారు. ఈ చిత్రంలో ప్రధాన పాత్రను టిల్లీ నార్వుడ్ అనే డిజిటల్ కృత్రిమ మేధ పాత్ర పోషిస్తోంది. కృత్రిమ మేధ ఆధారిత స్టూడియో నిర్మిస్తున్న ఈ చిత్రం విజ్ఞానశాస్త్ర నేపథ్యంతో కూడిన హాస్య, భావోద్వేగ కథగా రూపొందుతోంది. సంప్రదాయ నటీనటుల స్థానంలో కృత్రిమ మేధ పాత్రను ప్రధాన పాత్రలో చూపించడం సినీ రంగంలో కొత్త చర్చకు దారితీసింది. ఈ చిత్ర కథ మొత్తం క్లౌడ్ ఆధారిత డిజిటల్ ప్రపంచంలో సాగుతుంది. కథానాయికకు నిజమైన శరీరం, వ్యక్తిగత అనుభవాలు, చిన్ననాటి జ్ఞాపకాలు ఉండవు. అంతర్జాలంలో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగుతుంది.



# ‘క్వీన్ 2’కు రూ. 250 కోట్ల న్యాయ వివాదం

**బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చిన ‘క్వీన్’ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న ‘క్వీన్ 2’ విడుదలకు ముందే న్యాయ వివాదంలో చిక్కుకుంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉండగా, మేధో సంపత్తి హక్కుల అంశంపై రూ.250 కోట్ల దావా దాఖల వడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారిం ది. ఫాంటమ్ స్టూడియోస్ ముంబై హైకోర్టును ఆశ్రయిస్తూ జియోస్టార్‌పై రూ.250 కోట్ల పరిహారం కోరుతూ దావా వేసింది.**

ముంబై, జులై 7

తమ అనుమతి లేకుండానే ‘క్వీన్ 2’ను రూపొందించారని, దీంతో అసలు చిత్రానికి సంబంధించిన మేధో సంపత్తి హక్కులు ఉల్లంఘించబడ్డాయని సంస్థ ఆరోపిస్తోంది. ఫాంటమ్ స్టూడియోస్ వాదన ప్రకారం, ‘క్వీన్’ చిత్రానికి సంబంధించిన మేధో సంపత్తి హక్కుల్లో తమకు 50 శాతం వాటా ఉందని తెలిపింది. అలాంటి పరిస్థితిలో సీక్వెల్ లేదా అనుబంధ చిత్రాలను నిర్మించాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. అయితే ‘క్వీన్ 2’ నిర్మాణానికి సంబంధించి తమను ఎవరూ సంప్రదించలేదని, తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని కోర్టుకు వివరించినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఈ వివాదంపై ఫాంటమ్ స్టూడియోస్ బహిరంగ ప్రకటన విడుదల చేసినట్లు సమాచారం. అనంతరం జియోస్టార్, దర్శకుడు వికాస్ బహల్‌తో పలుమార్లు చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నిం చినప్పటికీ అవి ఫలించలేదని సినీ వర్గాలు చెబుతున్నాయి. ‘క్వీన్ 2’ చిత్రీకరణ పూర్తయిందని తెలిసిన తర్వాతే సంస్థ న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ ఆరోపణలపై జియోస్టార్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అలాగే చిత్రబృందం కూడా ఈ వివాదంపై ఇప్పటివరకు ప్రకటన విడుదల చేయలేదు. దీంతో కోర్టు ఈ వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ఇరు పక్షాలు రాజీకి వస్తాయా? లేక న్యాయపోరాటం మరింత ముదురుతుందా? అనే అంశాలపై సినీ పరిశ్రమలో ఆసక్తి నెలకొంది.

# కొడుకు గర్వపడే సినిమాలే చేస్తా: కాజల్ అగర్వాల్




**స్టార్ కథానాయిక కాజల్ అగర్వాల్ పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఆమె ప్రస్తుతం వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తల్లి అయిన తర్వాత తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని, ఇప్పుడు సినిమాల ఎంపికలో కొత్త ప్రమాణాలను పాటిస్తున్నానని తాజాగా వెల్లడించారు.**

ముంబై, జులై 7

ప్రస్తుతం ‘ది ఇండియా స్టోరీ’తో పాటు ప్రతిష్టాత్మక ‘రామాయణ’ చిత్రాల్లో నటిస్తున్న కాజల్, ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తల్లి అయిన తర్వాత ఏ కథ వినినా ముందు ఒక నటిగా కాకుండా తల్లిగా ఆలోచిస్తానని చెప్పారు. తన కుమారుడు నీల్ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడేలా ఉండాలని కోరుకుంటానని తెలిపారు. అందుకే మంచి కథ, బలమైన పాత్ర, సమాజానికి ఉపయోగపడే సందేశం ఉన్న చిత్రాలనే ఎంచుకుంటున్నానని వెల్లడించారు.

చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న ‘ది ఇండియా స్టోరీ’లో కాజల్ శక్తివంతమైన న్యాయవాది పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం జులై 24న ప్రేక్షకుల ముందుకు రానుంది. కల్తీ ఆహారం, వ్యవసాయంలో అధికంగా వాడుతున్న పురుగుమందుల వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాన్ని ఈ చిత్రంలో చూపిస్తున్నారని తెలిపారు. ఈ కథ విన్న తర్వాత ఒక తల్లిగా తాను ఎంతో ఆలోచించానని, సినిమా పూర్తయిన తర్వాత తమ ఇంట్లో ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు చేసుకున్నానని చెప్పారు. ముఖ్యంగా తన కుమారుడు నీల్‌కు అందించే ఆహారం విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నానని వెల్లడించారు. మరోవైపు ప్రముఖ దర్శకుడు నితేష్ తివారీ తెరకెక్కిస్తున్న ‘రామాయణ’ చిత్రంలో కాజల్ మండోదరి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా గురించి మాట్లాడుతూ, తన కుమారుడు నీల్‌కు చిన్నప్పటి నుంచే రామాయణ కథలంటే ఎంతో ఇష్టమని చెప్పారు. తాను రామాయణ చిత్రంలో నటిస్తున్నానని చెప్పగానే అతను చాలా సంతోషించాడని, అయితే శ్రీరాముడి కంటే రావణుడి పాత్రనే ఎక్కువగా ఇష్టపడతాడని నవ్వుతూ తెలిపారు. రామాయణ రెండో భాగం విడుదలయ్యే సమయానికి నీల్‌కు ఐదేళ్లు పూర్తవుతాయని, థియేటర్‌లో అతను చూసే తొలి సినిమా ఇదే అయ్యే అవకాశం ఉందని కాజల్ ఆనందం వ్యక్తం చేశారు.

# అఫ్గాన్ క్రికెట్‌కు తీరని లోటు.. షపూర్ జద్రాన్ కన్నుమూత





**చికిత్స కోసం ఇటీవల భారత్‌కు వచ్చి ఢిల్లీలోని ప్రముఖ ఆసుపత్రిలో వైద్యం పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగు పడలేదు. వ్యాధి తీవ్రత పెరగడంతో చివరకు ఆయన కన్నుమూశారు.**

**హైదరాబాద్, జులై 7**

అఫ్గనిస్థాన్ మాజీ వేగవంతమైన బౌలర్ షపూర్ జద్రాన్ మృతితో ఆ దేశ క్రికెట్‌లో విషాదం నెలకొంది. కొంత కాలంగా అరుదైన ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న ఆయన 38 ఏళ్ల వయసులో తుదిశ్వాస విడిచారు. రోగనిరోధక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే హీమోఫాగోసిటిక్ లింఫోహిస్టియోసిస్టోసిస్ అనే వ్యాధి కారణంగా ఆయన మరణించినట్లు అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. ఈ విషాద వార్తను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రకటిస్తూ జద్రాన్ కుటుంబ సభ్యులకు బోర్డు ప్రగాఢ సానుభూతి తెలిపింది. షపూర్ జద్రాన్ అఫ్గనిస్థాన్ క్రికెట్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. అంతర్జాతీయ వేదికపై అఫ్గనిస్థాన్ జట్టుకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన సేవలు విశేషమని అఫ్గనిస్థాన్ క్రికెట్ బోర్డు పేర్కొంది. దేశం గర్వించే ఆటగాడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని, అఫ్గన్ క్రికెట్‌కు అందించిన సేవలు చిరస్మరణీయమని నివాళు లర్పించింది.

గత ఏడాది అక్టోబర్ నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న జద్రాన్‌కు వైద్య పరీక్షల అనంతరం ఈ అరుదైన వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. చికిత్స కోసం ఇటీవల భారత్‌కు వచ్చి ఢిల్లీలోని ప్రముఖ ఆసుపత్రిలో వైద్యం పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగు పడలేదు. వ్యాధి తీవ్రత పెరగడంతో చివరకు ఆయన కన్నుమూశారు. హీమోఫాగోసిటిక్ లింఫోహిస్టి యోసిటోసిస్ అనే వ్యాధి సాధారణంగా చిన్నారుల్లో కనిపిస్తుంటుంది. అయితే పెద్దవారిలో ఈ వ్యాధి రావడం చాలా అరుదు. ఈ సమస్య వల్ల రోగనిరోధక వ్యవస్థ అతిగా స్పందించి శరీరంలోని ఎముకల మజ్జ, కాలేయం, ప్లీహం, లింఫ్ గ్రంథులు వంటి ముఖ్య అవయవాల పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అదే జద్రాన్ ఆరోగ్య పరిస్థితిని మరింత విషమంగా మార్చింది. ఆరడుగులకు పైగా ఎత్తు, వేగవంతమైన బౌలింగ్, ప్రత్యేకమైన జులపాల జుట్టుతో షపూర్ జద్రాన్ అభిమానులను ఆకట్టుకునేవారు. 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన ఆయన 2020 వరకు అఫ్గనిస్థాన్ జట్టుకు సేవలందించారు.




# కెప్టెన్ కూల్‌కు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**న్యూఢిల్లీ, జులై 7**

భారత క్రికెట్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలను అందించిన మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని నేడు తన 45వ జన్మదినాన్ని జరుపుకుంటున్నారు. రాంచీ వీధుల నుంచి ప్రపంచ క్రికెట్‌ను శాసించే స్థాయికి ఎదిగిన ధోని ప్రయాణం ప్రతి క్రీడాకారుడికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ సందర్భంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆయనకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భారత క్రికెట్‌కు సేవలందించిన దిగ్గజ ఆటగాడిగా కొనియాడింది. అంతర్జాతీయ క్రికెట్‌లో ధోని మొత్తం 538 మ్యాచ్‌లు ఆడి 17,266 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్‌గా 829 స్టంపింగ్‌లు, క్యాచ్‌లతో ఎన్నో రికార్డులు నెలకొల్పాడు. కెప్టెన్‌గా భారత జట్టుకు ట్వంటీ-20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ వంటి మూడు అంతర్జాతీయ ట్రోఫీలను అందించిన ఏకైక భారత కెప్టెన్‌గా చరిత్రలో నిలిచిపోయాడు. భారత రైల్వేలో టికెట్ కలెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ధోని, తన కష్టంతో ప్రపంచ క్రికెట్‌లో చిరస్థాయిగా నిలిచే స్థాయికి చేరుకున్నాడు. మైదానంలో ప్రశాంత స్వభావం, ఒత్తిడిని సైతం చిరునవ్వుతో ఎదుర్కొనే తీరు ధోనికి "కెప్టెన్ కూల్" అనే బిరుదును తెచ్చిపెట్టింది. వికెట్ల వెనుక మెరుపు వేగంతో స్టంపింగ్‌లు చేయడం, క్లిష్ట పరిస్థితుల్లోనూ చాకచక్యమైన నిర్ణయాలు తీసుకోవడం, హెలికాప్టర్ షాట్‌తో అభిమానులను అలరించడం ధోని ప్రత్యేకతగా నిలిచాయి. ప్రత్యర్థి బ్యాటర్లను క్షణాల్లో పెవిలియన్‌కు పంపించే అతని వికెట్ కీపింగ్ నైపుణ్యం ఇప్పటికీ అభిమానుల మదిలో చెరగని ముద్ర వేసింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో చెన్నై జట్టుకు ఎన్నో విజయాలు అందించిన ధోని ఈ సీజన్‌లో మాత్రం మైదానంలో కనిపించలేదు. గాయం కారణంగా తొలి మ్యాచ్‌లకు దూరమైన ఆయన, యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ సీజన్‌కు దూరంగా ఉన్నాడు.

# గ్యారేజ్‌లో గిల్ సందడి.. ఫార్ములా వన్ స్టార్‌తో క్రికెట్




**లండన్, జులై 7**

ఇంగ్లండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ముందు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అక్కడి విరామ సమయాన్ని ఆస్వాదిస్తున్నాడు. ఇటీవల పలువురు అంతర్జాతీయ ప్రముఖులను కలిసిన గిల్, తాజాగా మెర్సిడెజ్ గ్యారేజ్‌లో సందడి చేశాడు. అక్కడ ఫార్ములా వన్ యువ డ్రైవర్ కిమి ఆంటోనెల్లితో కలిసి కారిడార్ క్రికెట్ ఆడి అభిమానులను ఆకట్టుకున్నాడు. తమ తమ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న ఈ ఇద్దరూ ఒకే వేదికపై కనిపించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా వన్డే సిరీస్ ప్రారంభానికి ముందు లభించిన విరామాన్ని గిల్ పూర్తిగా వినియోగించుకుంటున్నాడు. ప్రముఖ క్రీడా ఉత్పత్తుల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆయన, మెర్సిడెజ్ గ్యారేజ్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఫార్ములా వన్ డ్రైవర్ కిమి ఆంటోనెల్లితో కలిసి సరదాగా క్రికెట్ ఆడాడు. టెన్నిస్ బంతితో ఆంటోనెల్లి బౌలింగ్ చేయగా, గిల్ చక్కటి షాట్లు ఆడుతూ అక్కడి వారిని అలరించాడు. ఆ తర్వాత కిమి ఆంటోనెల్లి కూడా బ్యాట్ పట్టుకుని కొన్ని షాట్లు ఆడగా, ఇద్దరూ నవ్వులు పూయిస్తూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా తీసిన వీడియోను శుభ్‌మన్ గిల్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకుంటూ, "మెర్సిడెజ్ గ్యారేజ్‌లో కారిడార్ క్రికెట్.. వేగవంతమైన కార్లు, వేగవంతమైన చేతులు ఒకే చోట" అనే భావంతో వ్యాఖ్యను జత చేశాడు.

# ఎంబాపేపై వివాదం.. క్షమాపణ చెప్పాలంటూ సెనేటర్ డిమాండ్

**పారిస్, జులై 7**

ఫుట్‌బాల్ స్టార్ కిలియన్ ఎంబాపే చేసిన సామాజిక మాధ్యమ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. పరాగ్వేకు చెందిన సెనేటర్ సెలెస్టే అమరిల్లాను ఉద్దేశించి ఎంబాపే చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆమె, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఫిఫా ప్రపంచకప్‌లో పరాగ్వేతో జరిగిన మ్యాచ్‌లో ఫ్రాన్స్ విజయం సాధించిన అనంతరం ఈ వివాదం చోటుచేసుకుంది. మ్యాచ్ ముగిసిన తర్వాత ఎంబాపే తన సామాజిక మాధ్యమ ఖాతాలో సెలెస్టే అమరిల్లాను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. స్పందించిన సెనేటర్, తనను అవమానించే హక్కు ఎంబాపేకు లేదని స్పష్టం చేశారు. సెలెస్టే మాట్లాడుతూ, తనకు ఫ్రాన్స్ దేశంపై ఎలాంటి వ్యతిరేక భావన లేదని, చిన్నతనంలో అక్కడే చదువుకున్నానని తెలిపారు. ఫ్రెంచ్ భాషపై కూడా తనకు మంచి పట్టు ఉందని, ఫ్రాన్స్‌ను గౌరవిస్తానని చెప్పారు. మ్యాచ్ అనంతరం ఎంబాపే ప్రవర్తించిన తీరు, పరాగ్వే ఆటగాళ్లతో వ్యవహరించిన విధానం తనను తీవ్రంగా బాధించిందన్నారు. ఆ కోపంతో తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు.






# శాంసన్‌కు రహానే మద్దతు



**న్యూఢిల్లీ, జులై 7**

జింబాబ్వే పర్యటనకు ఎంపిక చేసిన భారత ట్వంటీ-20 జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ కు చోటు దక్కకపోవడంపై మాజీ భారత టెస్టు కెప్టెన్ అజింక్య రహానే స్పందించాడు. ఇటీవల జరిగిన ట్వంటీ-20 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆటగాడిని తదుపరి సిరీస్‌కు ఎంపిక చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని తన సామాజిక మాధ్యమ వేదిక ద్వారా వెల్లడిస్తూ శాంసన్‌కు బహిరంగంగా మద్దతు తెలిపాడు. రహానే తన సందేశంలో, ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఆటగాడిని జింబాబ్వే పర్యటనకు దూరంగా ఉంచడం తనకు వింతగా అనిపించిందని పేర్కొన్నాడు.

# తప్పుడు ప్రచారంపై సూర్యకుమార్ స్పష్టత





**న్యూఢిల్లీ, జులై 7**

భారత ట్వంటీ-20 క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న తప్పుడు ప్రకటనపై తీవ్రంగా స్పందించారు. ఆ వ్యాఖ్యలు తాను చేసినవి కాదని స్పష్టం చేస్తూ, ధ్రువీకరణ లేని వార్తలను ఎవరూ నమ్మవద్దని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా ఆయన స్పష్టమైన ప్రకటన విడుదల చేశారు. ఇటీవల భారత జట్టు నాయకత్వంలో చోటుచేసుకున్న మార్పుల నేపథ్యంలో, తనకు భారత క్రికెట్ నియంత్రణ మండలి తగిన గౌరవం ఇవ్వలేదని, తన భవిష్యత్తుపై స్పష్టత లేదంటూ సూర్యకుమార్ వ్యాఖ్యానించినట్లు ఒక నకిలీ ప్రకటన సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వచ్చింది.

# శాంసన్‌ను పక్కన పెట్టడంపై కైఫ్ అసంతృప్తి

**న్యూఢిల్లీ, జులై 7**

భారత ట్వంటీ-20 జట్టులో స్టార్ ఓపెనర్ సంజు శాంసన్ కు వరుసగా అవకాశాలు దక్కకపోవడంపై మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రపంచకప్‌లో చేసిన తప్పునే జట్టు యాజమాన్యం, ఎంపిక కమిటీ మరోసారి పునరావృతం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. అనుభవజ్ఞుడైన ఆటగాడిని పక్కన పెట్టడం జట్టుకు ఏమాత్రం మేలు చేయదని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్ అనంతరం భారత జట్టు ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఐర్లాండ్‌తో సిరీస్‌ను కోల్పోయిన జట్టు, ఇంగ్లండ్‌తో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దవగా, రెండో మ్యాచ్‌లో నాలుగు వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఇదే సమయంలో పేలవ ప్రదర్శన కారణంగా సంజు శాంసన్‌ను రెండో ట్వంటీ-20 మ్యాచ్‌తో పాటు త్వరలో జరగనున్న జింబాబ్వే పర్యటన జట్టు నుంచి కూడా తప్పించడం అభిమానుల్లో చర్చనీయాంశమైంది. అతని స్థానంలో యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కి అవకాశం కల్పించారు.



"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467